# మంచితనం



ఆంధ్రభూమి వీక్లీ.. 18 సెప్టెంబర్, 2003

"నిన్నట్నుంచీ పద్మజ ఇంట్లో కూడా నీళ్లు రావడం లేదట!" అంది నిర్మల- భర్త బాలాజీతో.

"అయితే మన కాలనీలో మన ఇంటి బోరులోనే నీళ్లు ఇంకా వస్తున్నాయన్నమాట! పాపం... జనం నీళ్లకోసం ఎంత అల్లాడిపోతున్నారో..?!" అన్నాడు బాలాజీ బాధగా.

"ఇప్పటికే మనం అయిదు ఇళ్లకు త్రాగడానికి నీరు వదులుతున్నాం. ఇక పద్మజవాళ్ళకు కూడా మనమే ఇవ్వాలి."

"తప్పదు. సాటిమనిషిగా మనం సాయం చేయాలి. అది మన ధర్మం!" అన్నాడు బాలాజీ.

ఇంతలో... ఎవరో పిలిస్తే బయటకు వెళ్లింది నిర్మల.

కాసేపటి తర్వాత లోపలికొచ్చి- "వందనవాళ్ళ ప్రక్కింటావిడ... కొత్తగా వచ్చారు ఈ ఊరికి. త్రాగడానికి నీళ్లు ఒక బిందె పట్టుకుంటానని అడిగింది. ఇప్పుడే ట్యాంకు నిండిందని, మళ్లీ మోటారు వేస్తే నీళ్లు వృధా అవుతాయని, సాయంత్రం వస్తే మోటారు వేస్తానని చెప్పాను" అంది భర్తతో.

"అలాగా! సాయంత్రం వస్తే తప్పకుండా ఇవ్వు."

"అందరికీ ఇస్తూ పోతే... రేపు మన బోరు కూడా ఎండిపోతే అప్పుడేం చెయ్యాలి?"

"ఇంతవరకూ చూసుకున్న భగవంతుడు- తర్వాత మాత్రం చూసుకోడా? ఈలోపల వానలు కురియవచ్చు. మనం సహాయం చేయగలిగీ చేయకుండా ఉండటం తప్పు!"

"నేను సహాయం చెయ్యనని అనలేదు. 'ఆ పరిస్థితి వస్తే ఏంచేయాలో ఆలోచించుకొని ఉందాము' అన్నాను" అంది నిర్మల.

ఆరోజు సాయంత్రం వందన ప్రక్కింటావిడ వచ్చి ఒక బిందె నీళ్లు పట్టుకొని వెళ్లింది.

అయితే ఆమె ప్రతిరోజూ వచ్చి నీళ్లు తీసుకెళ్లడం చూసి, భార్యాభర్తలిద్దరూ ఆశ్చర్యపోయారు.

"అదేమిటి? ఆవిడ నీళ్లు అడిగింది. ఒక్కరోజుకే కదా?!" అని భార్యని అడిగాడు బాలాజీ.

"అవునండీ... ఒక్కరోజుకనే చెప్పింది!"

"మరి రోజూ తీసుకెళుతుందేమిటి? కనీసం మనల్ని అడగాలన్న జ్ఞానం కూడా లేకపోతే ఎలా? నీళ్లు తీసుకెళతానంటే మనం వద్దంటామా? రేపు ఆవిడ వచ్చినప్పుడు నేను అడుగుతాను"

"వద్దండీ. ఎందుకు అనవసరంగా గొడవ పడటం?"

"నేను గొడవ పడను. 'నీళ్లు ప్రతిరోజూ కావాల్సివుంటుందని మాకొక మాట చెప్పి ఉండాల్సింది మీరు' అని చెబుతాను. వాళ్ళ తప్పు వాళ్ళకీ తెలియనీ!"

మరుసటిరోజు ఆవిడ రాగానే ఆమెకి ఎదురుగా వెళ్లాడు. అయితే చెప్పాలనుకున్నది మాత్రం చెప్పలేకపోయాడు.

ఆమె అతనిని చూసి పలకరింపుగా నవ్వింది.

తనూ నవ్వి లోపలికి వచ్చేశాడు.

"అడిగారా..?" అని భర్తను అడిగింది నిర్మల.

లేదన్నట్టు తల అడ్డంగా ఊపాడు.

"నాకు తెలుసు. మీరు అలా మాట్లాడలేరు!" అంటూ నవ్వింది.

కొద్దిరోజుల్లోనే ఆవిడ నిర్మలకు క్లోజ్ అయింది. ఆవిడ పేరు... అంబిక. నిర్మలకు సాయంత్రాలు వాకింగ్‌కి తోడు ఎవరూ లేరని తెలిసి తను వస్తానని చెప్పింది.

రోజూ కబుర్లు చెప్పుకుంటూ వాకింగ్ చేయసాగారు. వీళ్ళను చూసి కాలనీలోని మరో నలుగురు మహిళలు వీళ్ళతో జత కలిశారు.

• • •

ఒక శనివారం మధ్యాహ్నం నిర్మల ఇంటికొచ్చింది అంబిక.

పిల్లలకు భోజనం పెడుతున్న నిర్మలతో మాట్లాడుతూ కూర్చుంది. మాటల మధ్య-

"మీది ప్రేమ వివాహం కదూ..?" అని అడిగింది నిర్మలను.

"కాదు. పెళ్ళయ్యాక ప్రేమించుకుంటున్నాం!" అంటూ నవ్వి, "ఎందుకా అనుమానం వచ్చింది మీకు?" అని అడిగింది నిర్మల.

"మీ ఆయన మీకు అన్నివిధాలా సహాయం చేయడం చూస్తూంటాను రోజూ! అందుకే అనుమానం వచ్చింది. అవునూ... ఈరోజు ఉదయం మీ హీరో కనబళ్లేదే..? ఊర్లో లేరా?"

"లేరు. నిన్న మా మరిది ఊరి నుంచి వచ్చారు. ఇద్దరూ కలిసి బెంగుళూరు వెళ్లారు. మా ఆయన ఫ్రెండ్ అక్కడ ఒక మంచికంపెనీలో పనిచేస్తున్నారు. మా మరిదికి ఉద్యోగం అడగడానికి వెళ్లారు."

"ఏ కంపెనీ అది?"

కంపెనీ పేరు చెప్పింది నిర్మల.

"అరెఁ... ఆ కంపెనీ జి.ఎమ్. మా బావగారే! మీ ఆయనకు సెల్ ఉందా?" అని అడిగింది అంబిక.

"ఉంది..."

"అయితే, మీరు వెంటనే మీవార్ని కాంటాక్ట్ చేసి ఆ కంపెనీ జి.ఎమ్. శ్రీపాదమూర్తిని కలిసి, నేను పంపినట్లు చెప్పి మీ మరిది ఉద్యోగ విషయం మాట్లాడమని చెప్పండి. మీ మరిది పేరేమిటి?"

"శివాజీ..!"

"నేను ఇప్పుడే వస్తాను. ఈలోపల మీరు నేను చెప్పిన పని చెయ్యండి!" అంటూ వెళ్లిపోయింది అంబిక.

పది నిమిషాల తర్వాత వచ్చి, "మీవారు దొరికారా?" అని అడిగింది.

"దొరికారు. మీరు చెప్పింది చెప్పాను!"

"నేనూ మా బావగారికి ఫోన్‌చేసి మీ మరిది విషయం చెప్పాను. తప్పకుండా ఉద్యోగం ఇస్తానన్నారు. గత ఆదివారం ఆయన ఇక్కడే ఉన్నారు. తమ కంపెనీ ఆర్థిక లావాదేవీలు చూసుకోవడానికి నమ్మకస్థుడైన వ్యక్తి ఫైనాన్స్ మేనేజరు పోస్టుకు కావాలని, ఇదివరకు ఉన్నతను డబ్బులు కాజేసి వెళ్లిపోయాడని, రోజురోజుకీ నమ్మకంగా పనిచేసేవారు కరువవుతున్నారనీ... అన్నారు. మంచి సమయానికి మీ మరిది విషయం చెప్పారు. దీనివల్ల అటు మీ మరిది సమస్యా తీరుతుంది, మా బావగారి సమస్యా తీరుతుంది!"

"మా మరిది నమ్మకస్థుడని మీకెలా తెలుసు?" నవ్వుతూ అడిగింది నిర్మల.

"ఆయన మీ ఆయనకు తమ్ముడు కనుక- తప్పకుండా నమ్మకస్థుడే అయివుంటాడు!" అంది అంబిక స్థిరంగా.

"మా ఆయన మంచితనం గురించి మాత్రం మీకు తెలుసా?"

"ఆయనను చూస్తే ఎవరైనా చెబుతారు... ఆయన సిన్సియర్, హానెస్ట్ అండ్ కమిటెడ్ అని!" అంది అంబిక.

ఆ మాటలు విని తన భర్త గురించి ఎంతో గర్వపడింది నిర్మల.

ఆరోజు రాత్రి స్వీట్‌పేకెట్‌తో ఇంటికి వచ్చిన బాలాజీ, శివాజీలను చూసిన నిర్మలకు విషయం అర్థమైంది.

తనకు ఉద్యోగం దొరికిందని, మంచి జీతం ఆఫర్ చేశారని, వారంరోజుల్లో డ్యూటీలో చేరాలని, అంబిక పేరు చెప్పగానే శ్రీపాదమూర్తి ఉద్యోగం ఇచ్చారని ఆనందంగా చెప్పాడు శివాజీ.

"రేపు ఉదయాన్నే అంబిక ఇంటికి వెళ్లి ఆమెకు థాంక్స్ చెప్పి వస్తాను" అంది నిర్మల.

"అలాగే! చూశావా ఆరోజు నేను కోపంతో ఆమెను ఓ మాట అనబోయి మానుకున్నాను. ఆ మాట అననందువల్ల ఆమె ఈరోజు మనకు ఎంతో గొప్పసహాయం చేశారు. అందుకే అనవసరంగా మాట జారవద్దని మన పెద్దలన్నారు!" అన్నాడు బాలాజీ.

"ఈ మాట మాత్రం ముమ్మాటికీ నిజం!" అంది నిర్మల.

పాఠకులకు, సాహితీప్రియులకు **జయంతి పబ్లికేషన్స్** అందిస్తున్న అపూర్వ అవకాశం!

**సి.ఎన్. చంద్రశేఖర్ రచనలు**

'నీ కోసమే...'
(కథాసంపుటి)
వెల : రూ॥ 100 /-



'కనులు మాటలాడునని...'
(కథాసంపుటి)
వెల : రూ॥ 60 /-



**ఈ రెండు పుస్తకాల సెట్‌ని ఒకేసారి కొనదలచుకుంటే కేవలం రూ॥ 100 /- లకే మీకు లభిస్తాయి.**

మీ ఆర్డర్లు
మనీయార్డరు, లేదా డిమాండ్ డ్రాఫ్ట్‌ల రూపంలో
పంపించాల్సిన చిరునామా

ఎస్వీ కృష్ణజయంతి
203, కంచి రెసిడెన్సీ, 11-19, పి & టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500060.